క్లుప్తంగా...

రైలు బోగీలో ఒడిస్సా వాసి మృతి

సికింద్రాబాద్: ఇద్దరు మిత్రులతో కలిసి ఉపాధి నిమిత్తం రైలులో నగరానికి వస్తున్న ఒడిస్సా వాసి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం ఎస్‌బీ పోకరి న్నయాకు చెందిన పీతాంబర్ కిసు (35) అనే వ్యక్తి మరో ఇద్దరు మిత్రులతో కలిసి హైదరాబాద్‌లో ఉపాధి కోసం ఈ నెల 4న భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. మరుసటిరోజు రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకుంటున్న సమయంలో బోగీలో కుప్పకూలి మృతిచెందాడు. అనారోగ్య కారణాల వల్ల పీతాంబర్ కిసు మృతి చెంది ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ల్యాప్ టాప్ దొంగల ముఠా అరెస్టు

అమీర్‌పేట: హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్ర అంబూరు జిల్లా తొండాలం గ్రామానికి చెందిన ఎం.డీనా, జి.సౌందరాజన్, ఎం.సారధి, ఎం.నటరాజన్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు అలవాటు పడ్డారు. నగరానికి వచ్చిన వీరు ప్రధానంగా హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని ముందుగా రెక్కీ నిర్వహిస్తారు.అ తరువాత హాస్టళ్లలో ఉండే వారిగా లోపలికి వెళ్లి గదుల్లో ఉన్న విలువైన ల్యాప్‌టాప్‌లను దొంగిలించి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుటున్నారు. గత నెల 31న ఎస్‌ఆర్‌నగర్‌లోని బాపూనగర్‌లోని ఓ హాస్టల్‌లో మణివంకర్, బ్రహ్మారెడ్డి అనే యువకులకు చెందిన రూ.1.50 లక్షలు విలువచేసే రెండు ల్యాప్‌టాప్‌లను దొంగిలించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ల్యాప్‌టాప్‌ల మాక్, ఐపీ అడ్రస్‌ల ఆధారంగా నిందితులను పట్టుకుని ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

‘కిమ్స్’లో అరుదైన గుండె శస్త్రచికిత్స

రాంగోపాల్‌పేట్: కార్డియాక్ అరెస్టుతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ మహిళ ప్రాణాలను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్సతో కాపాడారు. డాక్టర్ హయగ్రీవరావు వివరాల ప్రకారం.. ఓ మహిళ (36) గుండె సంబంధితో వ్యాధి ఉండటంతో 2017లో ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్–డిఫిబ్రిలేటర్(ఐసీడీ) అమర్చారు. అప్పటి నుంచి బాగానే ఉన్న ఇటీవల గుండె లయ తప్పి కార్డియాక్ అరెస్టు కావడంతో పలుమార్లు పదేపదే షాక్‌లు ఇచ్చి ప్రాణాలు కాపాడారు. మార్చి మొదటి వారంలో కిమ్స్ ఆస్పత్రికి రాగా ఒక్క రోజులోనే ఆమెకు 30 షాక్‌లు తగిలాయని అయితే ఈ షాక్‌లే ఆమె ప్రాణాలు కాపాడినట్లు వైద్యులు చెప్పారు. కానీ ప్రతి షాక్ ఆమెను తీవ్రమైన బాధకు గురిచేయడంతో పాటు గుండె బలహీనపడి చివరకు అది పనిచేయడం మానేస్తుంది. మరో వైపు ఐసీడీ బ్యాటరీ కూడా వేగంగా అయిపోయింది. అయితే ఆమెకు నాలుగు రకాల ఇంజక్షన్లు నరానికి ఇచ్చి, వెంటిలేటర్ మీద పెట్టారు. అయినా ఆమెకు కొంతం తక్కువ తీవ్రతతో షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ బీ హయగ్రీవారావు నేతృత్వంలో బృందం రోగికి 3–డీ మ్యాపింగ్, అబ్లేషన్ చేసి గుండె ఎడమ జఠరికలో అదనపు బీట్లను కచ్చితత్వంతో గుర్తించారు. రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన పల్స్‌తో దాన్ని నయం చేశారు. రెండు గంటలపాటు ఈ సుదీర్ఘ ప్రక్రియ తర్వాత ఫైబ్రిలేషన్ తీవ్రంగా లేకపోవడంతో పాటు గుండె లయ కూడా సాధారణ స్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉందన్నారు.

రైలు ఢీకొట్టి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శాంతినగర్‌కు చెందిన శివశంకర్ (45), రైలు ఏసీ బోగీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన నాగావళి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దు

- తల్లుల సంఘం కన్వీనర్ భాగ్యలక్ష్మి

అడ్డగుట్ట: రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షల ప్రశ్న పత్రాల వరుస లీకేజీ ఘటనలతో ద్వారా విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తెలంగాణ తల్లుల సంఘం ఆధ్వర్యంలో అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎంతోమంది తల్లిదండ్రులు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొని కూడా తమ పిల్లలను చదివిస్తుంటే, పరీక్షలు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితిలో నేటి విద్యాశాఖ ఉందని విమర్శించారు. కరోనా కాలంలో పిల్లలందరూ పాఠశాలలకు దూరమై ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఇప్పుడిప్పుడు చదువుతూ ముందుకెళ్తుంటే విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వాలు చెలగాటం ఆడటం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగానే ఈ విధమైన తప్పిదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మి, ప్రవీణ్ కుమార్, ఏ. సువర్ణ, బి. భాగ్య, లావణ్య, ప్రకాష్, సంతోష్ పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరనున్న వేళ!

- ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో నేడు ‘డబుల్’ ఇళ్ల ప్రారంభోత్సవం
- 48 మందితో కలిసి డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సామూహిక గృహప్రవేశం



ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన డబుల్ బెడ్రూమ్ భవనాలు

అడ్డగుట్ట: దశాబ్దాల నాటి పేదోడి సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ ఉన్న నిరుపేద ప్రజల డబుల్ బెడ్రూమ్‌లు సిద్ధమయ్యాయి. దాదాపు దశాబ్దకాలంగా వేరే ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివాసముంటూ చాలీచాలని జీతాలతో కాలం గడిపిన ప్రజలు ఎట్టకేలకు సొంతింట్లో అడుగు పెట్టనున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో పూర్తయిన 48 ఇళ్లను గురువారం (నేడు) డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రారంభించనున్నారు.

మిగిలిన 96 మందికి ఎన్నడో..

ఆజాద్ చంద్ర శేఖర్ నగర్‌లో మొత్తం 144 మంది వద్ద పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 48 మందికి ఇళ్లు వచ్చాయి. డబుల్ ఇళ్లు వచ్చిన లబ్ధిదారులు ఒకవైపు సంతోషంగా ఉంటే, మిగిలిన 96 మందికి ఇంకెప్పుడు వస్తాయోనని దిగులుగా ఉన్నారు. తగినంత స్థలం ఉండి ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పటికి పూర్తయ్యాయని, మిగిలిన డబుల్ ఇళ్లు కట్టడానికి స్థలం కూడా లేని బస్తీలో తమకు ఇళ్లు వచ్చేదెన్నడో అని ఆందోళన చెందుతున్నారు.

2016లో శంకుస్థాపన..

అర్హులైన పేద ప్రజలందరికీ ‘డబుల్’ ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో అప్పటి మంత్రి, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పలువురు మంత్రులతో కలిసి ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో 48 ఇళ్ల శంకుస్థాపన చేశారు. నిర్మాణ సమయంలో బస్తీలో గొడవలు, ఎన్నికల కోడ్, కోవిడ్ వ్యాప్తి వంటి కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. సుమారు రూ. 3.72 కోట్ల నిధులతో మొత్తం 5 బ్లాక్‌ల నిర్మాణం చేశారు. రెండు బ్లాక్‌లలో 12 ఫ్లాట్ల చొప్పున మరో మూడు బ్లాక్‌లలో 8 ఫ్లాట్ల చొప్పున మొత్తం 48 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేశారు.

ప్రశ్నించే గొంతును నొక్కుతున్న బీఆర్‌ఎస్



బీఆర్‌ఎస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతులు నొక్కేయాలని ప్రయత్నిస్తుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఆకుల ప్రతాప్ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లీకేజీల ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హత లేదన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం..

బన్సీలాల్‌పేట్: బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నాయకులు రాణిగంజ్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. బండి సంజయ్ అరెస్టు బీఆర్‌ఎస్ ప్రభుత్వ దుర్మార్గమైన చర్యకు నిదర్శమన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాడుతుంటే సహించలేని పాలకులు బండి సంజయ్ పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం దారుణమన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి ప్రజల దృష్టిని మళ్లించడానికి బండి సంజయ్‌ని అరెస్టు చేసిందన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ జాక్, ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఓయూలో ఓయూ జేఏసీ చైర్మన్ గద్దెల అంజిబాబు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ సంఘటన పై ప్రజల దృష్టి మళ్లించి నిందితులను కాపాడేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికను రచించి పదవ తరగతి హిందీ పేపర్ లీకేజీతో సంబంధం అంటగట్టి అరెస్ట్ చేయించారని ధ్వజమెత్తారు. బండి సంజయ్ అరెస్ట్‌కు నిరసనగా నేడు (6న) రాష్ట్ర యూనివర్సిటీల బంద్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎల్లన్న, పుల్లారావుయాదవ్, నెహ్రూనాయక్, రాస వెంకటముదిరాజ్, మేడి రమణ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి బీఆర్‌ఎస్ కృషి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

బౌద్ధనగర్: ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, కులాలు, మతాల పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. కార్పొరేటర్ కంది శైలజ ఆధ్వర్యంలో బుధవారం రాఘవ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంతో ఆయన జిల్లా ఇన్‌చార్జ్ దాసోజు శ్రావణ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల అమలును రెండు కళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమానికి కంచుకోటగా నిలిచిన సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల కృషితో తాము విజయాలను సాధించుకున్నామని సికింద్రాబాద్ పరిధిలో నిత్యం ప్రజలతో తాము సాన్నిహిత్యాన్ని కలిగి ఉన్నామన్నారు. దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కొన్ని దుష్ట శక్తులు యత్నిస్తున్నాయని వాటిని బీఆర్‌ఎస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న, యువనేతలు కిరణ్‌గౌడ్, రామేశ్వర్, కంది నారాయణ, లింగాని శ్రీను, కరాటే రాజ పాల్గొన్నారు.

మానెక్ షా సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న మధుసూదనాచారి

సనత్‌నగర్: భారత కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసేలా అనేక యుద్ధాల్లో మన సైనిక దళాలను ముందుండి నడిపించిన యోధుడు మానెక్ షా అని మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. భారత సైనిక దళాల మాజీ ప్రధానాధికారి ఫీల్డ్ మార్షల్ మానెఖ్ షా జయంతి ఉత్సవాన్ని బుధవారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో బేగంపేటలోని కుందన్‌బాగ్‌లో నిర్వహించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌ను చావుదెబ్బతీసిన శత్రు భయంకరుడు మానెక్‌షా అన్నారు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో దిశా నిర్దేశం చేస్తూ చరిత్రాత్మక విజయం సాధించారన్నారు. ఇలాంటి గొప్ప దేశ భక్తుడిని స్మరించుకునేలా సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ రీజనల్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనేష్‌కుమార్ మాట్లాడుతూ.. భారత సైనికులు దేశ సార్వభౌమాధికారాన్ని ఎల్లవేళలా నిలబెడుతుంటారన్నారు. ఆకృతి సంస్థ సైనికుల పట్ల చూపే అభిమానం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, ఫిక్కీ సీఎండీ జగదీష్‌చంద్ర, దేవాదాయ శాఖ మాజీ జాయింట్ కమిషనర్ వెంకటాచారి, మైసూర్ విశ్వ విద్యాలయం ఇంగ్లిష్ ప్రొఫెసర్ పద్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కూన వెంకటేష్‌గౌడ్ గుడ్‌బై



సనత్‌నగర్: బీఆర్‌ఎస్‌కు సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం పార్టీ తరుపున కూకట్‌పల్లి నుంచి పోటీ చేసి ఓటమి పాలై ఆ తర్వాత టీడీపీ గూటికి వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో సనత్‌నగర్ నుంచి టికెట్ ఆశించినప్పటికీ ఆ స్థానాన్ని తలసానికి కేటాయించడంతో కూన వెంకటేష్‌గౌడ్‌కు సికింద్రాబాద్ నుంచి బరిలోకి దింపారు. అప్పటి నుంచి టీడీపీలో కొనసాగిన కూన 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా టీడీపీ తరుపున సనత్‌నగర్ నుంచి పోటీ చేసి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల సమయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూన వెంకటేష్‌గౌడ్‌ల మధ్య బాహాబాహీ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఆ సమయంలో నెలకొన్నాయి. ఇదిలా ఉంటే కూన వెంకటేష్‌గౌడ్‌ను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించడమే కాకుండా అధిష్టానం ఆయనకు నామినేటెడ్ పోస్టు కేటాయిస్తుందనే ఆశ చూపినట్లు ఆ సమయంలో వార్తలు వినిపించాయి. ఆ మేరకే ఆయన బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నట్లు తన అనుచరుల వద్ద పలుమార్లు ప్రస్తావిస్తూ వచ్చారు. నామినేటెడ్ పోస్టు సంగతి అలా ఉంచితే.. పార్టీలో తగిన గౌరవం కూడా లభించడం లేదని గత కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు తెలిసిందే. దీంతో ఆయన ఆ పార్టీని వీడేందుకు సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా తన కుటుంబంతో సహా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కలిసి తన చేరిక విషయంపై చర్చించినట్లు తెలిసింది. అయితే ఈ విషయమై కూన వెంకటేష్‌గౌడ్‌ను వివరణ కోరగా టీడీపీలో చేరిక తథ్యమేనని చేరిక ఎప్పుడనేది త్వరలో ప్రకటిస్తానన్నారు.

‘బండి’ అరెస్టుపై జేపీ నడ్డా, అమిత్‌షా ఆరా

మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావుకు ఫోన్

లాలాపేట: ప్రశ్నపత్రాల లీకేజీలో బండి సంజయ్ అరెస్టుపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వేర్వేరుగా తార్నాకలోని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావుకు ఫోన్ చేసి అరెస్టుపై ఆరా తీశారు. బండి సంజయ్‌ను వెంటనే విడిపించేదుకు ప్రయత్నాలు చేయాలని సూచించారు. జైలుకు వెళ్తే ఆయనకు బెయిల్ వచ్చేలా లీగల్ టీం వేగంగా పని చేయాలని అన్నారు. జేపీ నడ్డా ఆదేశాలతో రామ్‌చందర్‌రావు బండి సంజయ్‌ని పెట్టిన బొమ్మల రామారం పోలీసు స్టేషన్‌కు బయలుదేరారు. కీసర వద్ద పోలీసులు అడ్డుకుని తార్నాకలోని ఇంటికి తీసుకువచ్చి హౌస్ అరెస్టులో పెట్టారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. బేగంపేట డివిజన్‌లోని మినర్వాడౌన్‌లో వాల్మీకి సఫాయి కర్మచారి సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా చెత్తా చెదారం పారబోయడంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించేలా అనేక కార్యక్రమాలను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రధాన కేంద్రాలు, అధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్‌లు, టాయిలెట్స్‌ను నిర్మించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నిర్వాహకులు ధరమ్‌వీర్, సుమిత్, విశాల్ పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం..

బేగంపేట హనుమాన్ శోభాయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెక్కల శివకుమార్, చెక్కల కాంచన, గంగారామ్, శ్రీనివాస్, వెంకట్, మూర్తి, ప్రవీణ్, నవీన్, అనంత్ బుధవారం మంత్రిని కలిసి ఆహ్వానించారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న లాస్యనందిత

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఏడో వార్డు సెంటినరీ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు దివంగత ఎమ్మెల్యే కుమార్తె లాస్య నందిత తెలిపారు. బుధవారం తిరుమలగిరిలోని చిన్నకమేళా, నెహ్రూ సెంటినరీ కాలనీలో లాస్యనందిత, నివేదిత పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లోప్రెషర్‌తో తాగునీటి సరఫరా అవుతోందని, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తన తండ్రి సాయన్న ఉన్న సమయంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేశారని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సరిత, తేజ్‌పాల్, యశ్వంత్‌కుమార్, పాల్గొన్నారు.

బండి సంజయ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: పదవ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలో అరెస్టు అయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్న ఎంపీ బండి సంజయ్ సభ్యత్వాన్ని రద్దు చేయకుంటే తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. జంగయ్య, నాగరాజు యాదవ్, రమేష్‌గౌడ్, నాగేందర్‌రావు, రామకృష్ణ, శ్రీనునాయక్, అంజిబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తార్నాకలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణలో బీజేపీ ప్రశ్నపత్రాల లీకేజికి కుట్ర చేసిందన్నారు. సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొలేక నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ, పది ప్రశ్న పత్రాల లీకేజీ విషయంలోని నిందితులకు బీజేపీ పెద్దలతో సంబంధాలు ఉన్నట్లు వాట్సాప్ పోస్టుల ద్వారా తేటతెల్లం అయ్యిందన్నారు.





జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



బేగంపేట-బల్కంపేట లింక్‌రోడ్డులో..



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



జయంతి వేడుకలకు హాజరైన పద్మారావుగౌడ్

స్ఫూర్తిదాయకం.. జగ్జీవన్ రామ్ జీవితం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని పలువురు కొనియారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకుని బుధవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్లలోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



నివాళి అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి



రాణిగంజ్ చౌరస్తాలోని విగ్రహానికి నివాళులర్పించిన సుచిత్ర శ్రీకాంత్, శశిధర్‌రెడ్డి



ఐడీహెచ్ కాలనీలో..



అంబేద్కర్ నగర్‌లో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన మన్నె క్రిశాంక్



పూలమాల వేస్తున్న రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్



పికెట్‌లో జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తున్న శ్రీగణేశ్



బాలంరాయి చౌరస్తాలో..



బోయిన్‌పల్లిలో..



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పాపారావు